క్లుప్తంగా

డైట్ ప్రిన్సిపాల్‌గా సుధాకర్



మాణిక్యంనాయుడును సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్‌గా ఇక్కడ సీనియర్ అధ్యాపకునిగా పనిచేస్తున్న ఎల్.సుధాకర్ నియమితులుకాగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన మాణిక్యంనాయుడు విజయనగరం డైట్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్‌ను అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఛాత్రోపాధ్యాయులకు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. అధ్యాపకులు త్రినాథరావు, మాధవి, హరిణి, అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

భీమునిపట్నం: భీమిలి జోన్ పరిధిలోని జీవీఎంసీ 2వ వార్డులో 'జగనన్న సురక్ష' కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము బుధవారం తెలిపారు. తగరపువలస గొల్లవీధిలోని ఎన్టీఆర్ పార్కులో కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జరుగుతుందని తెలిపారు. ఈ వార్డులోని నమ్మివానిపేట, చిన్న బజారు, ఆదర్శనగర్ 1, ఆదర్శనగర్ 2, బాలాజీనగర్ సచివాలయాల పరిధిలో నివసిస్తున్న ప్రజలు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఇక్కడ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు

భీమునిపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో తగరపువలసలోని శ్రీకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బీఎస్సీ చదువుతున్న దీపిక, కుందన ఆదిశ్రీ,, తేజశ్విని మంచి మార్కులు సాధించడంతో కళాశాల చైర్మన్ బి.నర్సింగరావు బుధవారం అభినందించారు. ప్రిన్సిపాల్ జె.సతీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ చిట్టిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐటీ హిల్స్‌కు బస్సు పునరుద్ధరణ

దాబాగార్డెన్స్ : ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఐటీ హిల్స్‌కు వెళ్లే ఉద్యోగుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ 25–టి సర్వీసును పునరుద్ధరించిందని, ఉద్యోగులు ఈ సర్వీసును వినియోగించుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వీసు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వయా కొమ్మాది, మారికవలస మీదుగా ఐటీ హిల్స్ వెళ్తుందని, ఉదయం 6, 8, 10.45, సాయంత్రం 4, 6 గంటలకు బయలుదేరుతుందని చెప్పారు. అలాగే కార్‌షెడ్ నుంచి ఉదయం 6.30, 8.30, 9.30, మధ్యాహ్నం 12.30, 1.30, 2.30, సాయంత్రం 4.30, 6.30కి బయలుదేరుతుందని, ఐటీ హిల్స్ నుంచి ఉదయం 7, 9, 9.55, మధ్యాహ్నం 12, 1, 2, 3, సాయంత్రం 5, 7 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు.

రైతులకు వరి విత్తనాలు పంపిణీ



రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న బోని అప్పలనాయుడు

ఆనందపురం : మండలంలోని బోని గ్రామంలో రైతు భరోసా కేంద్రం ద్వారా భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు రైతులకు వరి విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. 25 కిలోల పరిమాణం గల సాంబా మసూరి (బీపీటీ 5204) రకం ప్యాకెట్ రూ.830లు, శ్రీధృతి (ఎంటీయు 1121) రకం రూ.990లు, సోనా మసూరి (బీపీటీ 3291) రకం రూ.980కు రైతులకు అందజేశారు. అందులో ఒక్కో కిలోకు ప్రభుత్వం రూ.5 రాయితీ అందించింది. కార్యక్రమంలో వ్యవసాయాధికారి దిలీప్ చక్రవర్తి, బోని సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

- 'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ మేలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



నగరంపాలెంలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బాలరాజు

మధురవాడ: గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ పథకాలతోపాటు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు కూడా ప్రజల ఇంటి వద్దకే అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కొనియాడారు. జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీ, నగరంపాలెంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాలు బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజుతో కలిసి ప్రజలకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ప్రభుత్వ పథకాలు అందని అర్హుల వివరాలు తీసుకుని పథకాలు అందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులు, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం రూ.60 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యా కానుక కిట్లు, మధ్యాహ్న భోజనం, విద్యా దీవెన, వసతి దీవెన వంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అసంపూర్తిగా ఉండిపోయిన నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు త్వరలోనే చేపడతామని, అలాగే ఇతర సమస్యలు కూడా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో అంతా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు మాట్లాడుతూ ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచి పనులు గతంలోనూ చేయడానికి అవకాశం ఉన్నా... అప్పటి పాలకులకు చిత్తశుద్ధి లేక చేయలేదన్నారు. ప్రజలకు మేలు చేయడంలో తండ్రి వైఎస్సార్‌ను మించిన తనయుడు సీఎం జగన్ అని కొనియాడారు. ఈ సందర్భంగా వాంబేకాలనీ సచివాలయం పరిధిలో 900 దరఖాస్తులు అందగా 298 పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ కనక మహాలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, ఆర్‌ఐ మల్లేశ్వరరావు, డీఈ శ్రీహరి, ఏపీడీ గంగాధర్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, సచివాలయాలు ఇన్‌చార్జ్ కుడితి రామారావు, పెంద్ర.అప్పన్న, బాబ్జి, వాండ్రాసి రవికుమార్, చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, బెల్లాపు పాపారావు, మంగ, రామిరెడ్డి, ఎల్లాజీ, పోలరావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో కుటుంబాలకు రక్ష

ఆనందపురం : 'జగనన్న సురక్ష' కార్యక్రమం కోట్లాది కుటుంబాలకు రక్షణగా నిలిచిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బోని, కుసులువాడ గ్రామాల్లో బుధవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్న చిన్న సాంకేతిక కారణాల వల్ల ఎంతో మందికి అందకుండా పోయిన ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందించడంతో ప్రభుత్వ పథకాలు పొందగలుగుతున్నారని చెప్పారు. గతంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందాలంటే ఎన్నో వ్యయప్రయాసలకోర్చాల్సి వచ్చేదని... ఇప్పుడు వెంటనే అందిస్తున్నారని వివరించారు.



వాంబేకాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గతంలో పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేదని... ప్రస్తుతం ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలతోపాటు వారి అవసరాలను వలంటీర్లు గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ పొందుతున్నారన్నారు. చంద్రబాబు పాలనలో ఏ పథకానికీ అతీగతీ లేకుండా పోయిందన్నారు. వారివన్నీ తాత్కాలిక ఓటు బ్యాంక్ పథకాలని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ఏ ఒక్క పథకమూ నిలిచిపోకుండా తరాల తరాల వారు కూడా వాటి ఫలాలు పొందేవిధంగా రూపకల్పన చేశారని వివరించారు. ఒక వైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి పనులు చేపట్టి సుపరిపాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. మరలా జగన్ మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల కల్లబొల్లి మాటలు నమ్మవద్దని కోరారు. ఈ సందర్భంగా కుసులువాడలో 170 మందికి, బోనిలో 181 మందికి ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జగనన్న సురక్ష మండల ప్రత్యేకాధికారి సత్య పద్మ, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఎంపీడీవో అడపా లవరాజు, తహసీల్దార్ లోకవరపు రామారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, కుసులువాడ, ముకుందపురం, బోని సర్పంచ్‌లు మహంతి వెంకటలక్ష్మి, కలిమి గంగరాజు, బోని అప్పలకొండ, ఎంపీటీసీ సభ్యులు బోని పార్వతి, తోమురోతు లక్ష్మి, నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, బంటుబిల్లి మణిశంకరనాయుడు, పాండ్రింకి అప్పారావు, పిన్నింటి వెంకటరమణ, లెంక రాంబాబు, రౌతు వెంకటరావు, కోరాడ వెంకటరమణారావు, షిణగం రాంబాబు పాల్గొన్నారు.



బోని గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

సీఎం జగన్‌తోనే మేమంతా



ప్రస్తుతం ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న పథకాల ద్వారా నా పెద్ద కొడుకు బీటెక్ చదువుతున్నాడు. చిన్న కొడుకు పాలిటెక్నికల్ చదువుతున్నాడు. నా భర్త దివ్యాంగుడు అయినా సీఎం జగన్ సహకారం వల్లే చదివించగలుగుతున్నాం. ఎప్పటికీ ముఖ్యమంత్రిగా జగనన్నే ఉండాలి. మేమంతా అండగా ఉంటాం.

– తోట.వరలక్ష్మి, నగరంపాలెం

రెండు రోజుల్లో సర్టిఫికెట్



'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా రెండు రోజుల్లోనే నాకు సర్టిఫికెట్లు ఇచ్చారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్లు చాలా బాగా పనిచేస్తున్నారు. ఈ వ్యవస్థ చాలా బాగుంది. ముఖ్యమంత్రి జగన్ పాలన చాలా బాగుంది.

– గాయత్రి, మధురవాడ

చాలా ఏళ్లకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్



నా భర్త రాయిన అప్పలనాయుడు చనిపోయి 20 ఏళ్లు అవుతోంది. ఆయన పేరున ఉన్న భూ స్థిరాస్తిని నా పేరున మార్చుకోవడానికి రెవెన్యూ అధికారులు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అడిగారు. దాని కోసం గతంలో మూడు సార్లు దరఖాస్తు చేశాను. అవన్నీ తిరస్కరణకు గురయ్యాయి. కాగా జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీరు నా వివరాలను నమోదు చేసి అధికారులకు సమర్పించారు. దీంతో రెండు రోజుల్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీకి ఎమ్మెల్యే ఆదేశాలిచ్చారు. దీంతో వారం రోజుల్లో నా భర్త పేరున ఉన్న భూమిని నా పేరున మారుస్తామని తహసీల్దార్ చెప్పారు. ఎప్పటి నుంచో ఉన్న సమస్య పరిష్కారమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– రాయిన సన్యాసమ్మ, రామునేనిపేట, బోని పంచాయతీ

ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు



శంకరరావును సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు

పద్మనాభం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి మంచి గుర్తింపు ఉందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేసి బదిలీపై వెళ్లిన విజినిగిరి శంకరరావుతోపాటు 15 మంది ఉపాధ్యాయులను బుధవారం వీరు సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులేనన్నారు. ఈ సందర్భంగా వీరు ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఎంఈవో – 2 బాబూలాల్, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆర్.జగదీష్‌బాబు, ఎ.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

230 మందికి నేత్ర వైద్య పరీక్షలు



శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

ఆనందపురం : మండలంలోని లొడగలవానిపాలెంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 230 మందికి పరీక్షలు నిర్వహించారు. విజ్ఞాన్ ట్రీ సూపర్ స్పెషాలటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని స్థానిక సర్పంచ్ లొడగల రాజేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా 26 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు, 32 మందికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించారు. మిగతా వారికి అవసరమైన మందులు అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆపరేషన్లు చేయించడానికి నిర్ణయించారు. భానుకుమార్, హరీష్, భానుప్రకాష్ వైద్య సేవలు అందించారు. నాయకులు లొడగల రమణ, పాండ్రింకి అప్పారావు, రౌతు వెంకటరావు, బంక కృష్ణంనాయుడు, రౌతు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికల కళాశాల వసతిగృహం ప్రారంభం



వసతి గృహం భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

భీమునిపట్నం: చిప్పాడలోని దివీస్ ల్యాబొరేటరీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ నిధులు రూ.35 లక్షలతో ఆధునికీకరించిన భీమునిపట్నం ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహం భవనాన్ని కలెక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివీస్ యాజమాన్యం బాలికల వసతి గృహాన్ని ఆధునికీకరించడం అభినందనీయమన్నారు. అనంతరం వసతి గృహం ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆనందపురం : మండలంలోని వేములవలసలో గురువారం విద్యుత్ సరపరాకు అంతరాయం కలుగుతుందని మండల ఏఈఈ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కొన్నిప్రాంతాలకు రేపు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు మధురవాడ, శివశక్తినగర్, ఆర్టీసీ కాలనీ, నగరంపాలెం, మల్లయ్యపాలెం, చంద్రంపాలెం, రేవళ్లపాలెం, దుర్గానగర్, వాంబేకాలనీ, స్వతంత్రనగర్, గణేష్ నగర్, సాయిప్రియ లే అవుట్, వల్లీనగర్, వుడా కాలనీ, ఎస్‌జీజీవోస్ కాలనీ, టీచర్స్ లే అవుట్, వైభవ్‌నగర్, ప్రశాంతినగర్, గాయత్రి కాలేజీ, డీఆర్‌కే రాజు లే అవుట్, అన్నంరాజు నగర్, రిక్షా కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని రామమూర్తి కోరారు.

ప్లానింగ్ సెక్రటరీకి అభినందనలు

మధురవాడ: నగరంపాలెం వార్డు సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీగా పనిచేసి విశాఖపట్నం టౌన్‌లోకి బదిలీపై వెళ్తున్న శివను ఎమ్మెల్యే శ్రీనివాసరావు బుధవారం ఘనంగా సన్మానించారు. శివ విధులు సక్రమంగా నిర్వర్తించడంతోపాటు ట్రస్ట్ ద్వారా కోవిడ్, ఇతర సమయాల్లో కూడా పలు సేవలు అందించడం అభినందనీయమన్నారు. మరింత మందికి ఆయన ఆదర్శం కావాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వాండ్రాసి రవి తదితరులు పాల్గొన్నారు.

ఏళ్ల నాటి కల సాకారం

కార్‌షెడ్ జంక్షన్ నుంచి పాత పీఎంపాలెంకు రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న పోతిన శ్రీనివాసరావు, తదితరులు

మధురవాడ: కార్‌షెడ్ జంక్షన్‌ని ఆనుకుని ఉన్నా పాత పీఎంపాలెంకి సరైన రోడ్డు లేదంటే అతిశయోక్తి కాదు. 30 ఏళ్ల పైనుంచి కార్‌షెడ్ జంక్షన్ నుంచి గ్రామంలోకి పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం కోసం నాయకులు, స్థానికులు అనేక విజ్ఞప్తులు చేశారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాంత వాసుల ఏళ్లనాటి కల సాకారమైంది. వైఎస్సార్ సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు ఈ విషయాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రూ.28 లక్షలు మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో బుధవారం రోడ్డు పనులు పూర్తి కావడంతో పోతిన శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, ఇతర నాయకులు పనులు పరిశీలించారు. దీంతో ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తి పనులతో ఇక్కట్లు



గొయ్యి పూడ్చకపోవడంతో నిలిచిన ట్రాఫిక్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌కు చేరుకోవాలంటే పర్యాటకులు నరకం చూస్తున్నారు. బీచ్‌రోడ్డు ప్రధాన రహదారి నుంచి తీరానికి చేరుకునే రోడ్డు ఒక వైపు విద్యుత్ లైన్లకోసం అధికారులు గతంలో తవ్వించారు. పనులు పూర్తయిన తర్వాత రోడ్డుపై మట్టిని పూర్తి స్థాయిలో తొలగించకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. శని, ఆదివారాల్లో వందలాదిగా వచ్చే వాహనాల పార్కింగ్‌కు, రాకపోకలకు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా ఈ పర్యాటక ప్రాంతంలో కొన్ని చోట్ల రోడ్ల మీద దుకాణాలు ఏర్పాటు చేయడం మరో సమస్యగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.

తాగునీటికి కటకట



లక్ష్మీవానిపాలెం వెనుక నివాసాలకు తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ దుస్థితి

పీఎం పాలెం: స్థానిక రెండో నంబరు బస్టాప్ సమీపంలో గల లక్ష్మీవానిపాలెం వెనుక నివాసాలకు పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా లేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. సుమారు 2 సంవత్సరాల కిందట ఇక్కడి 200 కుటుంబాలకు తాగునీటిని సరఫరా చేయడానికి వీలుగా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. అయితే ఆ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ కారణంగా స్థానిక కుటుంబాలకు పూర్తి స్థాయిలో జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అందజేసే సురక్షిత నీరు అందడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటుగా నీరు కొనుక్కోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రజలకు మేలు చేసేందుకే 'గడప గడపకూ'..

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వాంబేకాలనీలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అధికారులు, స్థానిక నాయకులు

మధురవాడ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అమలుచేస్తూ, అభివృద్ధి పనులు చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కొనియాడారు. అయినప్పటికీ ఇంకా మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రజల బాగోగులు తెలుసుకునేందుకు ఎమ్మెల్యేలు అందరినీ ఇంటింటికీ పంపిస్తున్నారని చెప్పారు. బుధవారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన కాలనీలోని నివాసాల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన మేలును వివరించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాంబేకాలనీలో ఇప్పటికే 15 వందల ఇళ్ల పట్టాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, జిమ్ పరికరాల ఏర్పాటు వంటి పనులు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ రూరల్ మండల తహసీల్దార్ సనపల రమణయ్య, జెడ్పీ కనక మహాలక్ష్మి, సీఐ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, యువజన విభాగం రీజినల్ ఇన్‌చార్జి ముత్తంశెట్టి నందేశ్, వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, రామిరెడ్డి, ఎల్లాజీ, ఎమ్‌వీ రమణమూర్తి, అల్లాడ లింగేశ్వరరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసి పూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

విష్ణు సహస్రనామ పారాయణ ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి , తదితరులు

దాబాగార్డెన్స్ : పాతనగరంలోని గీతాభవన్‌లో గీతా ప్రచార సమితి స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక కల్యాణార్థం కోటి శ్రీవిష్ణు సహస్రనామ సామూహిక పారాయణ బుధవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ఆచార్య సార్వభౌమ డాక్టర్ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ వల్ల లోక కల్యాణంతో పాటు విశ్వశాంతి కలుగుతాయన్నారు. భక్తులందరూ ముక్తకంఠంతో సామూహికంగా శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ చేశారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి.జగన్‌మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు నేడు వ్యాక్సినేషన్

భీమునిపట్నం: స్థానిక పశు వైద్యశాలలో గురువారం జునోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా యంటీ ర్యాబిస్ టీకాలు వేయనున్నట్టు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటరమణ బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు టీకాలు వేస్తామని, ఈ అవకాశాన్ని కుక్కలను పెంచుకునేవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.